


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 01-08-2026 సంపుటి : 08 సంచిక 49 పేజీలు : 8 వెల : రూ 3-00


# 'భోగాపురం' ప్రారంభం వేళ కొత్త రికార్డులు



భోగాపురం విమానాశ్రయం ప్రారంభం వేళ పండుగ వాతావరణం ఏర్పడనుంది. ప్రధాని మోదీ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రారంభ వేడుక నిర్వహణ దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రారంభ ఘట్టాన్ని చరిత్రలో నిలిచిపోయేలా నిర్ణయాలు జరుగుతున్నాయి. 13 వేల మంది గిరిజన కళా కారులతో థింసా నృత్య ప్రదర్శన.. రెండు లక్షల మంది తో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రారంభ వేళ కొత్త రికార్డులు నమోదు కానున్నాయి.విమానాశ్రయం ప్రారంభం వేళ మోదీకి ఘన స్వాగతం లభించనుంది. అదే విధంగా విమానాశ్రయ ప్రారంభ వేడుకను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం ఇప్పటికే మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా 13 వేల మంది గిరిజన కళాకారులతో థింసా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ప్రదర్శన ఉండనుంది. గిన్నిస్ బుక్ రికార్డ్ నెలకొల్పే విధంగా 13 వేల మంది తో నృత్యం ఏర్పాటు చేస్తున్నారు. వేదిక వద్దకు చేరుకునే క్రమంలో 20 నిమిషాల పాటు ప్రధానికి స్వాగతం..రోడ్ షో ఉంటాయి. మరో 22 నిమిషాలు..భోగాపురం ఎయిర్పోర్ట్ లో ప్రధాని సందర్శన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు.ప్రధాని మోదీ ఉదయం

**- ప్రధాని మోదీ కోసం ఇలా..!!**



10:45 గంటలకు - ప్రత్యేక విమానం లో దిల్లీ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10:45 - 10:50 - గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర-రాష్ట్ర మంత్రులు ప్రధానికి స్వాగతం పలుకుతారు. 10:50 - 10:55 - కారు లో ప్రయాణికుల టెర్మినల్ భవనానికి చేరుకుంటారు. 10:55 - 10:58 - 200 మంది విద్యార్థుల కూచిపూడి నృత్యంతో ఘన స్వాగతం పలుకుతారు. 11:00 - 11:15 - భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులను పరిశీలిస్తారు. 11:17 - 11:25 - టెర్మినల్ భవనం నుంచి ఓపెన్‌టాప్ జీప్‌లో బహిరంగ సభా వేదికకు చేరుకుంటారు. ఇక.. 11:30 - 12:55 - విమానాశ్రయ ప్రారంభోత్సవం, శిలాఫలక ఆవిష్కరణ, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, బహిరంగ సభలో ప్రసంగం ఉంటుంది. మధ్యాహ్నం 1:05 - 1:10 - భోగాపురం నుంచి ప్రత్యేక విమానంలో తిరుగు ప్రయాణం తో మొత్తం 2 గంటల 25 నిమిషాలు ప్రధాని షెడ్యూల్ ఖరారు చేసారు.

# 'మోదీ జీ.. మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం': సీఎం చంద్రబాబు



అమరావతి, జులై 31: ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మితమైన ఈ విమానాశ్రయాన్ని రేపు(ఆగస్టు 1న) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. 'రేపు భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తున్నాం' అంటూ ఏపీ పర్యటనపై ఎక్స్‌లో ప్రధాని పోస్ట్ చేశారు. ఉత్తరాంధ్రకు మౌలిక సదుపాయాల కల్పనలో కీలక అడుగు పడుతోందని చెప్పారు.ప్రధాని పోస్ట్‌ను ట్రాక్ చేస్తూ సీఎం చంద్రబాబు రీ పోస్ట్ చేశారు. 'ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధంగా ఉంది... మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం మోదీ జీ' అంటూ పోస్టు చేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలొచ్చాయని, ఉత్తరాంధ్రకు గేట్‌వేగా భోగాపురం ఎయిర్‌పోర్టు నిలుస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇక, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారు: పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జులై 31: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మరోసారి విరుచుకుపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రాకు మణిహారమని గుర్తు పెట్టుకో జగన్ అని అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి అన్ని



ఏర్పాట్లు పూర్తైనట్లు తెలిపారు. అభివృద్ధిని చూసి జగన్ ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. కేవలం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ఆటంకం కలిగించేందుకే విశాఖకు జగన్ వచ్చారని ఆరోపించారు.కుతంత్రాలతో అభివృద్ధిని ఆపలేరని పల్లా అన్నారు. రానున్న కాలంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుందని వెల్లడించారు. గాజువాక నుంచి125, జిల్లా మొత్తం 5000 వేల బస్సుల్లో 5 లక్షల మంది ప్రజలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రత్యేకంగా దర్శించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్మించడం వల్ల అంతర్జాతీయంగా వ్యాపారస్థులు ఉత్తరాంధ్రకు రావడం అలాగే పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ రావడం వల్ల ఎన్నో పరిశ్రమలు వచ్చాయని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

# ఆయన దీక్ష చేయకపోతే ధర్మేంద్ర రాజీనామా సాధ్యమయ్యేదే కాదు: అభిజీత్ దీప్కే



న్యూఢిల్లీ, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో తనకు విభేదాలు ఉన్నాయన్న వార్తలను కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కొట్టిపారేశారు. నీట్ పేపర్ లీక్ ఉద్యమంలో ఆయన త్యాగాన్ని ఎన్నటికీ మర్చిపోలేమని అన్నారు. తమ మధ్య ఏకాభిప్రాయం ఉందని స్పష్టం చేశారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిజీత్ దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు.ఆందోళన ముగింపు ప్రసంగంలో సోనమ్ వాంగ్‌చుక్ గురించి తాను ప్రస్తావించకపోవడానికి విభేదాలే కారణమన్న వాదనను అభిజీత్ తోసిపుచ్చారు. తమ మధ్య ఏకాభిప్రాయం ఉందని అన్నారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్టు కూడా తెలిపారు. నాటి ఆందోళన యువత చేపట్టారని, పోలీసు చర్యలను ఎదుర్కొన్నారని అన్నారు. కాబట్టి తన ప్రసంగంలో వారికి ధన్యవాదాలు తెలిపానని అభిజీత్ వివరించారు.'కానీ వాంగ్‌చుక్ సర్ త్యాగాన్ని మేము ఎన్నటికీ మర్చిపోలేము. ఆయన తన ప్రాణాల్ని సైతం లెక్క చేయక 26 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారు. తన ప్రాణాల్ని పణంగా పెట్టి జాతి అంతరాత్మను జాగృతం చేశారు. యువత వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా చేశారు. ఆయన ఆమరణ దీక్ష చేయకుంటే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సాధ్యమయ్యేదే కాదు' అని అన్నారు. ఆమరణ దీక్షను ముగించాలని తాను వ్యక్తిగతంగా ఎన్నోసార్లు చెప్పానని అన్నారు.కేంద్ర మంత్రుల సమక్షంలో వాంగ్‌చుక్ దీక్షను విరమించడం విచారం కలిగించిందా? అన్న ప్రశ్నకు అలాంటిదేమీ లేదని అభిజీత్ బదులిచ్చారు. ఆసుపత్రిలో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు తనను అనుమతించకుండా, కేంద్ర మంత్రులకు ఆ అవకాశం కల్పించినందుకు అసంతృప్తి కలిగిందని చెప్పారు. ఇతర సీజేపీ సభ్యులతో పాటు ప్రతిపక్ష నాయకులను కూడా వాంగ్‌చుక్‌ను కలిసేందుకు అనుమతించలేదని అన్నారు. ఒక రకంగా చూస్తే కేంద్రం వాంగ్‌చుక్‌ను కిడ్నాప్ చేసినట్టేనని వ్యాఖ్యానించారు. అయితే, వాంగ్‌చుక్ తన దీక్షను విరమించారని తెలిసి ఊపిరి పీల్చుకున్నట్టు దీప్కే తెలిపారు. దేశ భవిష్యత్తుకు ఆయన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.సీజేపీకి రాజకీయ పార్టీగా మారే ఉద్దేశం లేదని మరోసారి చెప్పారు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చే ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే కొనసాగుతామని అన్నారు. ప్రభుత్వంలో జవాబుదారీతనం తేవడమే తన లక్ష్యమని అన్నారు. తాను రాజకీయ నాయకుడిగా మారనని కూడా చెప్పారు. నేటి పరిస్థితుల్లో అర్థవంతమైన మార్పులు ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమని చెప్పారు.

# ఏపీ ఓటరు జాబితా ముసాయిదా విడుదల..



అమరావతి, జులై 31: రాష్ట్రంలో 3.71 కోట్ల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని ఏపీ ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈవో వివేక్ యాదవ్ మాట్లాడారు. ఈ ముసాయిదా జాబితాను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) నెట్ యాప్, సీఈవో వెబ్‌సైట్‌లలో పరిశీలించ వచ్చునని ఓటర్లకు ఆయన సూచించారు.మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని.. వారిలో 89.22% మంది ఫారాలు సమర్పించారని ఆయన తెలిపారు. అయితే 15.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు గుర్తించామని వివరించారు.

**89.22 శాతం మంది ఫారాలు సమర్పించారు: సీఈవో**

22.30 లక్షల మంది శాశ్వత చిరునామా మారినట్లు లేదా గైర్హాజరైనట్లు కనుగొన్నామని చెప్పారు. 7.37 లక్షల మంది ఓటర్ల పేర్లు రెండు, మూడు చోట్ల నమోదయ్యాయని పేర్కొన్నారు.ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్న వారి పేరు ఒకే చోట కొనసాగేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నిజమైన ఓటర్లు ఫారం-6తో మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్‌తోపాటు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు.అక్టోబర్ 3వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. నోటీసు, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించబోమని ఈ సందర్భంగా వెల్లడించారు. అర్హులెవరు మిస్ కాకుండా, అనర్హులు చేరకుండా పారదర్శక ప్రక్రియకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని సీఈవో వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.




# సంపాదకీయం

శనివారం 01-08-2026

## తెల్ల ఏనుగులా మారినపశ్చిమాసియా యుద్ధం

పశ్చిమాసియా యుద్ధం అమెరికా పాలిట తెల్లఏనుగులా మారింది. యుద్ధం కోసం అమెరికా దాదాపుగా 3.6 లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది . ఇదే విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. యుద్ధాన్ని కొనసాగించేందుకు, క్షీణిస్తున్న వనరులను తిరిగి సమకూర్చుకునేందుకు మరిన్ని అత్యవసర నిధులు కావాలని ట్రంప్ ప్రభుత్వం కోరుతున్న నేపథ్యంలో ఆయన ఈ వివరాలను చట్టసభ సభ్యులకు అందించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ కమిటీ ఎదుట జరిగిన విచారణలో హెగ్‌సెత్ ఈ నూతన అంచనాలను తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఆ లోపు అయ్యే ఖర్చులను కూడా కలుపుకుని ఈ అంచనాను రూపొందించారు. గతంలో మే, జూన్ నెలల్లో ఈ వ్యయం సుమారు 29 నుంచి 30 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా వేయగా, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పెరిగింది. యుద్ధ కార్యకలాపాల కోసం సుమారు 67 బిలియన్ డాలర్ల అదనపు రక్షణ నిధులను కేటాయించాలని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కెయిన్‌తో కలిసి హెగ్‌సెత్ సెనేట్‌ను అభ్యర్థించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈ ఘర్షణ, ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ విఫలం కావడంతో మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఇరు పక్షాల మధ్య ప్రతిరోజూ దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టును బలహీనపరిచే లక్ష్యంగా అమెరికా దాడులు సాగుతున్నాయి. ఈ జలసంధిలో ఏర్పడిన అంతరాయాలు అమెరికాలో గ్యాస్ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ ఘర్షణలో ఇప్పటివరకు 17 నుంచి 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని, వంద మందికి పైగా గాయపడ్డారని పెంటగాన్ వెల్లడించింది. గాయపడిన వారిలో చాలామంది తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే, యుద్ధ వ్యూహం, కాలపరిమితిపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఇరు పార్టీల చట్టసభ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ యుద్ధం వల్ల కలుగుతున్న ఆర్థిక, మానవ నష్టాన్ని డెమొక్రాట్లు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్లకు స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో, నిధుల కేటాయింపు బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయపక్షాల మద్దతు తప్పనిసరి. మరోవైపు ఈ విచారణ జరుగుతున్న సమయంలోనే కొందరు నిరసనకారులు సభకు అంతరాయం కలిగించి యుద్ధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని దాడులకు సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. మరో వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినట్లుగానే ఇరాన్ పై .. యూఎస్ ఆర్మీ దాడులు ముమ్మరం చేసింది. ఇరాన్ లోని కీలక టార్గెట్లపై అమెరికా విరుచుకుపడింది. అగ్రరాజ్యం దాడులతో ఇరాన్ దద్దరిల్లింది. జోర్డాన్‌లోని తమ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ చేసిన దాడికి ప్రతిగా ఈ శక్తిమంతమైన దాడులు జరుగుతున్నాయని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. మరోవైపు.. జోర్డాన్‌లోని బేస్‌లపై దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. "మేం వారిని గట్టిగా దెబ్బకొడతాం" అని ప్రకటించారు. ఆ క్రమంలోనే దక్షిణ ఇరాన్ లో శక్తిమంతమైన పేలుళ్లు వినిపిస్తున్నాయి. ఖేష్మ్ ద్వీపాన్ని, అణువిద్యుత్ కేంద్రం ఉన్న తీరనగరం బుషెహర్‌ను అమెరికా సైన్యం టార్గెట్ చేసింది. ఖేష్మ్ ద్వీపంలో నివాస ప్రాంతాలపై క్షిపణి దాడి జరిగిందని ఇరాన్ స్థానిక మీడియా వెల్లడించింది. జోర్డాన్‌లోని ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను టార్గెట్ చేశామని ఐఆర్‌జీసీ వెల్లడించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంత కాలం.. ఇరాన్ వైపు నుంచి ప్రతిఘటన ఉంటుందని హెచ్చరించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తాము అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. తాము డజన్ల కొద్దీ ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లు పేర్కొంది. ఇరాన్, గల్ఫ్ దేశాలకే పరిమితమైన యుద్ధం బుధవారం మరో టర్న్ తీసుకుంది. ఈజిప్ట్‌లోని డమియెట్టా పోర్ట్‌లోని అమెరికాకు చెందిన గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి చేసింది. దాంతో ఎల్ఎన్‌జీ లోడింగ్, ఇతర ప్రక్రియలు జరుగుతోన్న సమయంలో ఈ దాడి జరగడంతో భారీగా మంటలు ఎగిసిపడి, వేగంగా మరో ట్యాంకర్‌కు విస్తరించాయి. దాంతో అత్యవసర సహాయక బృందాలు నావికులను అక్కడి నుంచి తరలించాయి. ఇంధన నిల్వలున్న మరో దేశానికి ఘర్షణలు విస్తరించడంతో యుద్ధం తీవ్ర రూపం దాల్చుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారతీయ కుటుంబాలకు న్యాయం చేయండి.. సుప్రీంకోర్టు ఆదేశం

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారీ సంఖ్యలో భారతీయులు కూడా పాల్గొన్నారు. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోగా.. ఇంకొందరు గాయపడ్డారు. మరికొందరి గురించి అసలు సమాచారమే లేదు. దీంతో వారి కుటుంబాలకు న్యాయం చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని భారత సుప్రీంకోర్టు ఆదేశించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో బలైన భారతీయ కుటుంబాలకు సహాయం అందించేందుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఒక నోడల్ అధికారిని నియమించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. అలాగే, ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడ్డ, మిస్సైన వారి వివరాలను బాధిత కుటుంబాలకు స్థానిక భాషలో అందజేయాల్సిందిగా కూడా ప్రభుత్వానికి కోర్టు సూచించింది. నిజానికి రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొన్న



భారతీయులకు సంబంధించిన వివరాలపై అధికారిక ప్రకటన ఏదీ లేదు. ఇదే సమయంలో ప్రభుత్వం కూడా ఎలాంటి వివరాల్ని వెల్లడించలేదు. దీంతో ఇంతకాలంగా ఈ విషయంలో తమ వారిని దూరం చేసుకున్న భారతీయ కుటుంబాలు తమకు న్యాయం చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహన్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబాల డీఎన్ఏ సేకరించి, మృతుల డీఎన్ఏతో పోల్చి, వారి మృతదేహాల్ని లేదా అస్థికల్ని కుటుంబ సభ్యులకు అందజేయాలని కోరింది. ఇండియాలోని రష్యా రాయబార కార్యాలయం నుంచి బాధితులకు సంబంధించి తగిన వివరాలు సేకరించాలని, నష్టపరిహారం కూడా అందజేయాలని కోర్టు సూచించింది. ఈ విషయంలో బాధిత కుటుంబాలకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ), స్టేట్ లీగల్ సర్వీసెస్‌లు సహాయం అందించాలని సూచించింది. మృతదేహాలను లేదా అస్థికలను బాధిత కుటుంబాలకు అందజేయడంలో, పరిహారం అందజేయడంలో సహాయం చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాలని, బాధిత కుటుంబాలకు పరిహారం, న్యాయం అందేలా రష్యా రాయబార కార్యాలయాల్ని ఆదేశించేలా దావా దాఖలు చేయాలని కూడా కేంద్రాన్ని కోరింది. ఈ పరిహారం విదేశీ వ్యవహారాల శాఖ ద్వారా మాత్రమే అందజేయాలని సూచించింది. ఈ పరిహారం అందడం ఆలస్యమైనంత మాత్రాన మృతదేహాల్ని అప్పగించడంలో ఆలస్యం చేసి, అంత్యక్రియలు నిర్వహించడంలో ఆలస్యం జరిగేలా చేయొద్దని కూడా సూచించింది. 2024, 2025లో చాలా మంది భారతీయులు వివిధ వర్క్ వీసాలపై రష్యా వెళ్లారు. అయితే, అక్కడ చాలామందిని రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి.

## 'నాన్న యూనిఫాం రక్తంతో తడిసిపోయింది'.. న్యాయం చేయండి ప్లీజ్.!

జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన ఢిల్లీ పోలీసు సిబ్బంది కుటుంబాలు న్యాయం కోసం డిమాండ్ చేశాయి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆందోళనకారులు.. రాళ్లురువ్వడం సహా చెప్పులతో దాడి చేశారని ఆరోపిస్తూ నేడు(శుక్రవారం) మీడియా ఎదుట బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. ఈ సందర్భంగా గాయపడిన ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) కుమారుడు మాట్లాడుతూ తన తండ్రి ఎదుర్కొన్న పరిస్థితిని వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. 'మా నాన్న యూనిఫాం రక్తంతో తడిసిపోయింది' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనల సమయంలో ఆయన తలకు తీవ్ర గాయమైందని, నాలుగు కుట్లు కూడా పడినట్టు చెప్పుకొచ్చారు. తన తండ్రిని ఆ పరిస్థితుల్లో చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యానని వాపోయారు. నిరసనల సమయంలో గుంపులో కొందరు అసాంఘిక శక్తులు కలిసిపోయి మూకుమ్మడిగా రాళ్ల దాడికి దిగారని తన తండ్రి చెప్పినట్లు కుమారుడు వివరించారు. పోలీసులు



స్పందించే అవకాశం లేకుండా వరుస దాడులు జరిగాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది.. నిరసనకారుల దాడులకు గురయ్యారని, గాయపడిన వారికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ప్రజల రక్షణ కోసం పనిచేసే పోలీసులపై దాడులను సహించరాదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జంతర్‌మంతర్ వద్ద జులై 25న జరిగిన ఆందోళనలో తన తండ్రిపై కొందరు దాడి చేశారని ఢిల్లీ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుమార్తె ఆరోపించారు. బారికేడ్ల సమీపంలో విధులు నిర్వహిస్తున్న తన తండ్రిని కొందరు వ్యక్తులు లాక్కెళ్లి దాడి చేశారని, దాదాపు చంపేంత పని చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. అనంతరం తన తండ్రి ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో సుమారు నాలుగు గంటలపాటు స్పృహ లేకుండా ఉన్నారని చెప్పారు. 'ఆ రోజు రాత్రి 10 గంటల సమయంలో నాన్న సహోద్యోగులు ఆయనను ఇంటికి తీసుకొచ్చారు. ఆయన యూనిఫాం మొత్తం రక్తంతో తడిసి ఉంది. ఆ పరిస్థితిలో ఆయనను చూడటం ఎంతో బాధ కలిగించింది. మా కుటుంబం ఎదుర్కొన్న అత్యంత కష్టమైన రాత్రుల్లో అది ఒకటి' అని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. నిరసనల్లో జరిగిన హింసపై, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులపై జరిగిన దాడులకు సోషల్ మీడియాలో తగినంత ప్రాధాన్యం దక్కలేదని ఆరోపించారు. 'సోషల్ మీడియా తెరిచి చూస్తే.. మా నాన్ననే నేరస్థుడిగా చూపించారు. ఆయనపై దాడి చేసిన వారే సుప్రీంకోర్టుకు వెళ్లారని ఆ తర్వాత తెలిసింది. మాకూ సమాన హక్కులు ఉన్నాయి. మాకూ న్యాయం కావాలి' అని ఆమె అన్నారు.

## యువతపై బీజేపీ ఫోకస్.. జెన్-జీ కోసం కొత్త వ్యూహం..

న్యూఢిల్లీ: నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై విద్యార్థుల నిరసనలు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రాజకీయ చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన కమ్యూనికేషన్ వ్యూహాన్ని మార్చుకునేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా జెన్-జీ యువతతో నేరుగా అనుసంధానం కావడానికి కొత్త సోషల్ మీడియా వేదికలను వినియోగించే దిశగా పార్టీ అడుగులు వేస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ప్రధానంగా ఏకపక్ష సందేశాలకే పరిమితమైన ప్రచార విధానానికి బదులుగా.. ఇకపై యువతతో ద్విముఖ సంభాషణ కు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతతో తమ పార్టీకి ఉన్న కమ్యూనికేషన్ లోటును జెన్-జీ ఉద్యమం స్పష్టంగా బయటపెట్టిందని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత తరం బాధ్యతాయుతమైన సమాధానాలు కోరుతోందని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదని, వ్యవస్థలో సమూల మార్పులు అవసరమనే భావన యువతలో బలంగా ఉందని పార్టీ గుర్తించినట్లు తెలుస్తోంది. ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు జెన్-జీని సమర్థంగా చేరుకోవడంలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఈ వేదికలను మరింత సమర్థంగా వినియోగిస్తూ యువతను ఆకర్షిస్తున్నాయని బీజేపీ భావిస్తోంది. దీంతో సోషల్ మీడియా వ్యూహంలో మార్పులు తప్పనిసరి అయ్యాయని నేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో యువత ఎక్కువగా వినియోగించే ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, రెడ్డిట్ మాధ్యమాల్లో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా యువకులతో కూడిన సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఇలాంటి బృందాలు ఉంటే ప్రభుత్వ విధానాలు, పార్టీ సందేశాలను యువతకు వారి భాషలో, వారికి నచ్చే శైలిలో చేరవేయవచ్చని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. యువతతో సమర్థవంతంగా మాట్లాడాలంటే యువతే ప్రధాన పాత్ర పోషించాలని, పెద్దలు కూడా వారితో మాట్లాడేటప్పుడు వారి శైలినే అనుసరించాల్సి ఉంటుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరును పార్టీ ఉదాహరణగా చూపుతోంది. విద్యార్థుల ఆందోళనల సమయంలో ప్రధాని సెల్ఫీ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడం యువతను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయమని పార్టీ నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువ యాక్టివ్‌గా ఉండే సమయాన్ని, వారికి చేరువైన మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా వారితో మమేకమయ్యే ప్రయత్నం చేశారని పేర్కొంటున్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో కన్నీళ్లు పెట్టుకున్న హరీశ్ రావు



మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రలో మాజీ మంత్రి హరీశ్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్న ఆయన ఆప్త మిత్రుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, సుదర్శన్ రెడ్డికి తుది వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు నర్సంపేటకు తరలివచ్చారు. అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసేందుకు జనం పోటెత్తడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది. పెద్ది అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించగా, ఎటు చూసినా పెద్ది అభిమానులే కనిపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పార్థివదేహం వరంగల్ జిల్లాలోని నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి చివరి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అభిమానుల రద్దీతో నర్సంపేట ప్రధాన రహదారులపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు.


## భారత్‌కు జిన్‌పింగ్ రాక?.. బ్రిక్స్ సదస్సుకు హాజరయ్యే అవకాశం!



చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత్‌ను సందర్శించే అవకాశమున్నట్లు దౌత్య వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్‌శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరయ్యే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ పర్యటన ఖరారైతే.. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైన్యాల మధ్య జరిగిన ఘర్షణ అనంతరం జిన్‌పింగ్ భారత్‌కు రావడమిదే తొలిసారి కానుంది. జిన్‌పింగ్ చివరిసారిగా 2019 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ(ఒంఅ) వెంబడి నెలకొన్న ఉద్రిక్తతలు, గల్వాన్ ఘర్షణలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం సైనిక, దౌత్య స్థాయిలో పలు దఫాలుగా చర్చలు కొనసాగుతున్నాయి. చైనా అధ్యక్షుడి పర్యటనకు ముందు ఇరు దేశాల మధ్య దౌత్య చర్చలు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ త్వరలో చైనాలో పర్యటించే అవకాశాలూ కనిపిస్తున్నాయి. అలాగే భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్టేషన్ అండ్ కోఆర్డినేషన్(చిఓఅఅ) సమావేశం కూడా జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు సరిహద్దు వివాదంపై ప్రత్యేక ప్రతినిధుల మధ్య త్వరలో సమావేశం నిర్వహించే అవకాశముంది. సరిహద్దు సమస్యల పరిష్కారానికి కొత్త నిపుణుల బృందం, వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటుచేయాలని ఇటీవల ఇరు దేశాలు అంగీకరించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరిచుకుంది. జిన్‌పింగ్ భారత పర్యటన ఖరారైతే.. బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత్, చైనా నాయకుల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగే అవకాశముంది. సరిహద్దు వివాదం, ప్రాంతీయ భద్రత, ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారం వంటి కీలకాంశాలు చర్చకు రావచ్చు. అయితే.. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు ఇటు ఢిల్లీ గానీ, అటు బీజింగ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనా విడుదల చేయలేదు.

## బీజేపీకి షెహజాద్ పూనావాలా రాజీనామా

న్యూఢిల్లీ, జులై 31: భారతీయ జనతా పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా పార్టీ వీడారు. తాజాగా, తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో షెహజాద్ బీజేపీని వీడినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాజీనామా నేపథ్యంలో ఆయన గురువారం తన ఎక్స్ ఖాతాలో బయో వివరాలు మార్చేశారు. 'జాతీయ అధికార ప్రతినిధి' హోదాను తొలగించారు. షెహజాద్ పూనావాలా బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా చాలా యాక్టివ్‌గా ఉండేవారు. బీజేపీ తరపున తరచుగా టీవీ డిబేట్లలో పాల్గొనేవారు. షెహజాద్ పూనావాలా కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రయాణం మొదలుపెట్టారు. ఆయన 2017లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను బహిరంగంగా వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. కాంగ్రెస్




పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీని ఎన్నుకునే ప్రక్రియ అంతా ఒక నాటకమని, అది ముందే ఖరారైన వ్యవహారమని షెహజాద్ పూనావాలా తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలో ప్రజాస్వామ్యం లేదని, అర్హత ఆధారంగా కాకుండా కేవలం కుటుంబ నేపథ్యం ఆధారంగానే పదవులు ఇస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే నిష్పక్షపాతంగా ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. బీజేపీ ఆయనకు జాతీయ అధికార ప్రతినిధి పదవిని కల్పించింది. దాదాపు 8 ఏళ్ల తర్వాత ఆయన బీజేపీ నుంచి బయటకు వచ్చేశారు. అయితే, ఆయన ఏ కారణాలతో పార్టీని వీడారన్నది అధికారికంగా తెలియరావాల్సి ఉంది.

# సున్నిపెంటలో ప్రజా వినతులు

--గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31:'వన్ మంత్?ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంటలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సున్నిపెంటలో ఇళ్ల స్థలాలు, గృహాలు, పెన్షన్లు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు అధికంగా వచ్చినట్లు తెలిపారు. తాగునీటి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రతి ఇంటికి ప్రత్యేక విద్యుత్ కనెక్షన్, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు త్వరలో ఉద్యోగ మేళా నిర్వహించాలని సూచించారు.ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# డీఎస్సీపై విచారణకు వైసీపీ డిమాండ్--

మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని వినతిపత్రం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31:డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్డీఓ రామునాయక్‌కు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ ఫలితాల్లో పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా నియామకాలు, ర్యాంకుల కేటాయింపుపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అలాగే ఎన్నికల హామీలైన నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# రైతునగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం--

హాజరు కావాలని కమిషనర్ బి. శేషన్న పిలుపు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31:రైతునగర్ (22వ వార్డు)లో 15వ ఆర్థిక సంఘం నిధులతో పూర్తయిన సీసీ డ్రైన్, పైప్‌లైన్ పనుల ప్రారంభోత్సవాన్ని శనివారం (ఆగస్టు 1) ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, జిల్లా స్పెషల్ ఆఫీసర్, జిల్లా మేజిస్ట్రేట్ జి. రాజకుమారి గణియా హాజరుకానున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ బి. శేషన్న కోరారు.



# కోవెలకుంట్లకు హైటెక్ సామూహిక మరుగుదొడ్లు--

సులబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆధునిక నిర్వహణ: ప్రజల ప్రశంసలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31- కోవెలకుంట్ల బస్టాండ్ సమీపంలోని సామూహిక మరుగుదొడ్లను సులబ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతిలో నిర్వహిస్తున్నారు. పరిశుభ్రత, అత్యాధునిక సౌకర్యాలు, వినియోగదారులకు అనుకూలమైన వసతులతో హైటెక్ నమూనాలో నిర్వహిస్తున్న ఈ మరుగుదొడ్లు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి.బస్టాండ్‌కు నిత్యం వచ్చే ప్రయాణికులు, వ్యాపారులు, స్థానికులు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉందని, మరుగుదొడ్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా నిర్వహిస్తున్న తీరును అభినందిస్తున్నారు.అధికారులు కూడా ఈ మరుగుదొడ్లను పరిశీలించి, సులబ్ ఇంటర్నేషనల్ సంస్థ అత్యాధునిక ప్రమాణాలతో నిర్వహణ చేపట్టడం అభినందనీయ మని పేర్కొన్నారు. పరిశుభ్రతను కాపాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించడంలో సులబ్ ఇంటర్నేషనల్ సంస్థ చేపడుతున్న ఈ నిర్వహణ ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిజిటల్ సేవలు--

సబ్ రిజిస్ట్రార్ బాల సుబ్రహ్మణ్యం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ సేవలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు సులభంగా జరుగుతున్నాయని శిరివెళ్ల సబ్ రిజిస్ట్రార్ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) సేవలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.ప్రజలు నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించి పీడీఈ ద్వారా దస్తావేజులు సిద్ధం చేసుకుని యథావిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లోనే దస్తావేజుల తయారీ, రిజిస్ట్రేషన్ పూర్తి చేసి వెంటనే పత్రాల ముద్రిత ప్రతులను అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# 'వన్ మంత్ - ఫోర్ విజిట్'తో ప్రజా సమస్యల పరిష్కారానికి వేగం

ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గడువులోగా పరిష్కరించండి

సున్నిపెంటలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన

నంద్యాల, జూలై 31:-ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. 'వన్ మంత్ – ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని సున్నిపెంట రెడ్డివారి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌లు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ప్రతి అర్జీని స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకొని వేగవంతంగా పరిష్కరించడమే 'వన్ మంత్ – ఫోర్ విజిట్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం నియోజకవర్గంలో ఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాలలో 900కు పైగా అర్జీలు స్వీకరించామని, వాటిలో అత్యధికంగా రెవెన్యూ, సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి అర్జీపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్య వాస్తవ పరిస్థితిని తెలుసుకున్న అనంతరమే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారమైన వెంటనే సంబంధిత ఉత్తర్వులు లేదా చర్యల ప్రతిని అర్జీదారునికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీకరించిన అన్ని వినతులను కలెక్టరేట్ బృందం డిజిటలైజ్ చేసి వెంటనే సంబంధిత శాఖలకు పంపించి నిరంతర పర్యవేక్షణ చేపడుతుందని తెలిపారు.సున్నిపెంట ప్రాంతంలో అధికంగా ఇళ్ల స్థలాలు, గృహాలు, పెన్షన్లు, విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, ప్రాథమిక వసతులకు సంబంధించిన సమస్యలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను అర్హతల మేరకు పరిశీలించి, స్థలం మాత్రమే కోరిన వారి వివరాలను వేరుగా నమోదు చేయాలని, ఇల్లు మరియు స్థలం రెండూ అవసరమైన వారి ప్రతిపాదనలను ఆర్డీఓకు పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సున్నిపెంటలో కొన్ని ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు ఇళ్లకు ఒకే విద్యుత్ మీటర్ ఉండటం వల్ల పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కోల్పోతున్నాయని వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, గతంలో కేటాయించిన గృహాల జాబితాను పరిశీలించి ప్రతి ఇంటికి ప్రత్యేక విద్యుత్ మీటర్, విద్యుత్ కనెక్షన్ కల్పించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వెస్ట్రన్ కాలనీతో పాటు ఇతర కాలనీల్లో వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కొరత ఉందని ప్రజలు తెలియజేశారని, సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అడవి మృగాల సంచారం దృష్ట్యా వీధి దీపాల ఏర్పాటు అత్యవసరమని పేర్కొంటూ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని ఆదేశించారు. సున్నిపెంట తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.15 కోట్ల వరకు నిధులు మంజూరు చేసిందని, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లు, మోటార్లు, ప్రత్యామ్నాయ నీటి వనరులను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రోడ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రెయినేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ కార్యాచరణ రూపొందించి డ్రెయినేజీ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాల ద్వారా ఇప్పటికే అనేక మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని, త్వరలో సున్నిపెంట ప్రాంత యువతకు ఉపయోగపడేలా మరో భారీ ఉద్యోగ మేళా నిర్వహించి సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు.శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే స్వీకరించి నెల రోజుల్లో పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలను ఇప్పుడు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మండల స్థాయికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సున్నిపెంట ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

# మహానందిలో ఘనంగా వరుణ యాగం--

రెండో రోజు ప్రత్యేక పూజలు, హోమాల్లో భక్తుల భాగస్వామ్యం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31: రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని సంకల్పంతో మహానంది పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న త్రయాహ్నిక వరుణ యాగం రెండో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగింది. వేద పండితుల ఆధ్వర్యంలో రోజు వరుణ, పర్జన్య కలశార్చనలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, వరుణానువాక హోమాలు అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం ఆలయ లోపలి కోనేట్లో వరుణ పూజ, పర్జన్య సూక్త పారాయణం, ప్రత్యేక జపాలు నిర్వహించి రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. యాగశాలలో వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, వ్యవసాయాభివృద్ధి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని సంకల్పించి వరుణ యాగాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

# ప్రజా సమస్యలపై ఎస్పీ దృష్టి--

సుండిపెంటలో వినతులు స్వీకరించి అధికారులకు ఆదేశాలు--




విభారె న్యూస్, నంద్యాల, జూలై 31:శ్రీశైలం నియోజకవర్గంలోని సుండిపెంట గ్రామంలో నిర్వహించిన వన్ మంత్?ఫోర్ విజిట్ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.కార్యక్రమంలో శాఖల వారీగా ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు, వెంటనే పరిష్కరించగల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరిస్తామని, ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల--

ప్రత్యేక కలెక్టర్ (ఈఆర్వో) శివ ప్రసాద్ రెడ్డి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 31: భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)?2026 కార్యక్రమంలో భాగంగా 139-నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న విడుదల చేసినట్లు ప్రత్యేక కలెక్టర్ (ఈఆర్వో) శివ ప్రసాద్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ముసాయిదా జాబితాపై జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం-7 ద్వారా అనర్హుల పేర్ల తొలగింపు, ఫారం-8 ద్వారా వివరాల సవరణ, పోలింగ్ కేంద్రం మార్పు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు, ప్రజలు ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి అవసరమైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు ప్రత్యేక కలెక్టర్ (ఈఆర్వో) శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు. రూరల్ తాసిల్దార్ శ్రీవాణి. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శేఖర్. రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్లు రామ సంజీవ రావు. రామ చంద్రరావు. రెవిన్యూ ఇన్ స్పెక్టర్లు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190